## మెదక్ శాయ్ సెంటర్‌ను పునఃప్రారంభించాలి

### కేంద్రమంత్రికి విన్నవించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న శివసేనారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 8: మెదక్‌లోని శాయ్ ఎస్‌టీసీ అథ్లెటిక్స్ సెంటర్‌ను పునఃప్రారంభించాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి కేంద్ర సహాయ మంత్రి రక్ష నిఖిల్ ఖడ్సేకు శనివారం వినతిపత్రం అందజేశారు. రెండు రోజులుగా హైదరాబాద్‌లో ఒలింపిక్స్ సన్నద్ధత, క్రీడా పరిపాలనపై కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియా అధ్యక్షతన చింతన్ శిబిర్–2025 నిర్వహించారు. తెలంగాణలోనే అతి పెద్దదైన అథ్లెటిక్స్ స్టేడియం మెదక్‌లో ఉందని, అకాడమీ ఇక్కడి నుంచి తరలించడంతో నిరుపయోగంగా మారిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తరలించిన అథ్లెటిక్స్ అకాడమీని పునఃప్రారంభించాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు శివసేనరెడ్డి తెలిపారు. ఆయన వెంట తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు వెంకటేశ్వరరావు, నందకిశోర్, గోకుల్ తదితరులు ఉన్నారు.

## పంచముఖి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



మెదక్ మున్సిపాలిటీ, మార్చి 8: మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించిన అంజిరెడ్డి శనివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి మధుసూదనాచారి, అంజిరెడ్డి దంపతులను సన్మానించారు.

## పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ.1.11లక్షల విరాళం



విరాళం అందజేసిన మహేశ్‌గుప్తాను సన్మానిస్తున్న పెద్దగొట్టిముక్ల గ్రామస్తులు

శివ్వంపేట, మార్చి 8 : మండలంలోని పెద్ద గొట్టిముక్ల గ్రామంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయానికి మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా రూ.లక్షా11వేల నగదును ఆలయ కమిటీ సభ్యులకు శనివారం విరాళంగా అందజేశారు. అనంతరం మాజీ జడ్పీటీసీని వారు సన్మానించారు. పిల్లుట్ల గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు, అదే గ్రామంలో మృతి చెందిన సఫాయి కార్మికురాలు రామమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదును అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సులోచనా నర్సింహారెడ్డి, నాయిని దామోదర్‌రెడ్డి, చింతస్వామి, పిల్లి శివకుమార్, బబ్బూరి వెంకటేశ్, పిల్లి ఏసాములు, పిల్లి మధు, ఉప సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు నవీన్, ముదిరాజ్ సంఘం సభ్యులు ఉన్నారు.

## పడకేసిన పారిశుధ్యం

- సమస్యలను పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మక్తభూపతిపూర్‌లో రోడ్డు పక్కన చెత్త



తిమ్మానగర్ దారిలో పడేసిన చెత్త

మెదక్‌రూరల్, మార్చి 8: ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుధ్యం పడకేసింది. మెదక్ మండలంలోని పల్లెల్లో పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తున్నది. సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి గ్రామాలను పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. పంచాయతీల్లో నిధులు లేక, ప్రత్యేకాధికారులు నామమాత్రంగా పని చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వీధిదీపాలు పనిచేయడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు రాక, ప్రత్యేకాధికారులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## విద్యా వైద్యాన్ని మెరుగుపరుస్తాం



రామాయంపేట, మార్చి 8: విద్యా, వైద్యాన్ని మెరుగుపరుస్తామని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. శనివారం రామాయంపేటలోని శిశుమందిర్ వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. శిశుమందిర్ అంటే విజ్ఞానం, వికాసం, పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సుప్రభాతరావు, అల్లాడి వెంకటి, సంగమేశ్వర్, పండరినాథ్, కైరంకొండ తిరుపతి ఉన్నారు.

## బాధితులకు ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎంపీపీ పురం రవి

మనోహరాబాద్, మార్చి 8: మండలంలోని రామాయిపల్లిలోని బండి యాదమ్మకు చెందిన కిరాణ దుకాణంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. దీంతో వస్తువులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మాజీ ఎంపీపీ పురం నవనీతా రవి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో మర్కంటి భిక్షపతి, కుమార్‌గౌడ్, సత్యనారాయణ గౌడ్, భాస్కర్‌గౌడ్, ప్రసాద్ గౌడ్, మర్కండెయ బాబు, ప్రభాకర్, సాయి కుమార్, సురేందర్, శ్రీనివాస్, ప్రవీణ్, వెంకటేశ్, రాజు, బాబు ఉన్నారు.

## కట్టెల కోత మిషన్‌లో అగ్ని ప్రమాదం





చేగుంట, మార్చి 8: కట్టెల కోత మిషన్‌లో మంటలు చెలరేగి రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగిన ఘటన చేగుంటలో అర్ధరాత్రి చోటు చేసుకున్నది. బాధితుడు గోవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి చెలరేగిన మంటల్లో యంత్రాలు, రేకుల షెడ్డు, కట్టెలు దగ్ధమయ్యాయి. ఫైర్ ఇంజిన్ మంటలు ఆర్పినా ప్రయోజనం లేదు. మంటల్లో సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని గోవింద్ కోరారు.

# మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్: డాన్‌బాస్కో స్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: క్రీడాకారిణులకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న న్యాయమూర్తి లక్ష్మీశారద

- నేటి విజయం జీవితానికి నాంది కావాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

నర్సాపూర్, మార్చి 8: నేడు సాధించిన విజయమే రేపటి జీవితానికి నాంది కావాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లో ఎమ్మెల్యేను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని డాన్‌బాస్కో పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో టెక్నాలజీని ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. టెక్నాలజీ ద్వారా తెలియని విషయాలను తెలుసుకుని నాలెడ్జ్ పెంచుకోవాలన్నారు. నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డిని బీఆర్‌ఎస్ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి కేక్ కట్ చేసి మహిళలకు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకుడు సత్యంగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, అశోక్‌గౌడ్, నాయకులు సూరారం నర్సింహులు, రాంచందర్, రింగుల ప్రసాద్, ఆనంద్, రాకేశ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ నర్సిరెడ్డి, చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన పాల్గొన్నారు.



చేగుంటలో మాజీ ఎంపీపీ పుష్పలత శ్రీనివాస్



నర్సాపూర్: చీరలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్సీ



మెదక్ మున్సిపాలిటీ: దవాఖానలో ఎమ్మెల్యే రోహిత్

### సమాజంలో సమానత్వం రావాలి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 8: మహిళలకు ఇంటి నుంచే సమానత్వం ప్రారంభం కావాలని, సమాజంలో సమాన అవకాశాలు కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. జిల్లా కేంద్రంలోని అవుట్ డోర్ స్టేడియంలో ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారిణులకు స్పోర్ట్స్‌కిట్స్ పంపిణీ చేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, మహిళా సాధికారత కేంద్రం మిషన్ సమన్వయకర్త సంతోష పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కలం స్నేహం ఆధ్వర్యంలో స్థానిక మాయా గార్డెన్‌లో పాటల సీడీని జడ్జి ఆవిష్కరించారు.



మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో..



నిజాంపేట: మహిళలకు శాలువా కప్పి సన్మానిస్తున్న ఉపసర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కొమ్మాట బాబు



కౌడిపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేసుకుని సంబరాలు జరుపుకొంటున్న మహిళా ఉద్యోగులు



రామాయంపేట: మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు టిఫిన్ బాక్సులను అందించి సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

## ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే



స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన పూజల్లోపాలొన్న మాజీ ఎమ్మెల్యే

మెదక్‌రూరల్, మార్చి 8: మండలంలోని పేరూరులో ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ మహోత్సవంలో బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామి అనుగ్రహంతో గ్రామం పచ్చగా ఉండాలన్నారు. ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని ఆకాక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆమె వెంట మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మెదక్, మాచవరం పీఏసీఎస్ చైర్మన్లు హన్మంత్‌రెడ్డి, సీతారామయ్య, నాయకులు కిష్టయ్య, అంజాగౌడ్, ప్రభాకర్, పుట్టి యాదగిరి, రామచంద్రరెడ్డి, ఏగొండ, జయరాంరెడ్డి, రాములు, మల్లేశం, నరేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి. గ్రామస్తులు ఉన్నారు.

## లోక్ అదాలత్‌లో 1500 కేసులు పరిష్కారం



మెదక్ అర్బన్, మార్చి 8: రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ పడడంతో ఇరువురికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 1500 అన్ని రకాల కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు రూ.46,32,000 నష్ట పరిహారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిరిసౌజన్య, స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ప్రభాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్ పాల్గొన్నారు.

### చిన్నశంకరంపేటలో విద్యార్థికి సన్మానం

చిన్నశంకరంపేట, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్‌లో చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అంకితను జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద సత్కరించారు. అంకిత ఇటీవల వారణాసిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, అల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

కౌడిపల్లి, మార్చి 8: మండలంలోని కొట్టాల గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి గ్రామస్తులు ఆహ్వాన పత్రికను శనివారం అందజేశారు.

### ప్రమాదంలో మామ, గుండెపోటుతో కోడలు మృతి



సుమలత (ఫైల్)



పోచయ్య(ఫైల్)

చేగుంట, మార్చి 8: చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో మామ, విషయం తెలిసి గుండెపోటుతో కోడలు మృతి చెందిన ఘటన మండలంలోని మక్కరాజిపేటలో శనివారం చోటు చేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందులతో ఆరోళ్ల సుమలత(38) పురుగు మందు తాగింది. ఆమె మామ ఆరోళ్ల పోచయ్య 108 వాహనంలో దవాఖానకు తరలిస్తున్నాడు. దౌల్తాబాద్ మండలం నర్సంపల్లి సమీపంలోని రహదారిలో 108 వాహనాన్ని మరో వాహనం ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ఉన్న పోచయ్య(65)కు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో పోచయ్య శనివారం మృతి చెందాడు. సుమలతకు ఆరోగ్యం కుదుటపడింది. దీంతో తూప్రాన్ మండలం గణపూర్‌లోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. శనివారం మామ మృతి చెందాడు. దీన్ని తట్టుకోలేక సుమలతకు గుండెపోటు వచ్చింది. ఆమెను దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందింది. దౌల్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అధ్వాన్న రోడ్డుతో అవస్థలు




గుంతలమయంగా దామరచెర్వు బీటీ రోడ్డు



సూచిక బోర్డు లేక ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

- కిలోమీటరు మేర రోడ్డులో పగుళ్లు, గుంతలు
- కొన్ని నెలలకే దెబ్బతిన్న రూ.90 లక్షల రోడ్డు
- ఎక్కడా కనిపించని సూచిక బోర్డులు
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం




కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన బోర్డు

రామాయంపేట రూరల్, మార్చి 8: మండలంలోని దామరచెర్వు బీటీ రోడ్డు 1.6 కిలోమీటర్లు. కొన్ని నెలల క్రితం రెన్యువల్ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం రూ.90 లక్షలు మంజూరుచేసింది. సదరు కాంట్రాక్టరు ఈ పనులను తూతూ మంత్రంగా చేపట్టి బిల్లు పొందారు. రోడ్డు వేసిన కొద్ది రోజులకే గుంతలు పడడంతో పాటు చాలా చోట్ల రోడ్డు దెబ్బతిన్నది. రోడ్డు మూల మలుపుల వద్ద ఎక్కడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరగుతున్నాయి. బీటీ రోడ్డు వేసిన కొద్ది నెలలకే సుమారు కిలోమీటరు మేర పూర్తిగా గుంతలమయంగా మారింది. ఒకటి కాదు రెండు కాదు కిలోమీటర్ల పరిధిలో ఎన్నో గుంతలు, రోడ్డులో పగుళ్లు ఏర్పడ్డాయి. దీన్ని చూస్తే ఎన్నో ఏండ్ల కిందట వేసిన రోడ్డుగా తయారైంది. గ్రామస్తులు, వాహనదారులు ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ విషయంలో ఉన్నతాధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని, రోడ్డును వెంటనే పరిశీలించి చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

## 15 నుంచి ఒంటి పూట బడులు



నిజాంపేట పాఠశాల

- ఉమ్మడి మండలంలో 53 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 20 ఉన్నత పాఠశాలలు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు

రామాయంపేట, మార్చి 8 : వేసవి దృష్యా ఈ నెల 15 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూట బడులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రామాయంపేట, నిజాంపేట ఉమ్మడి మండలాల్లోని మొత్తం 53 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత. 17 జడ్పీహెచ్‌ఎస్‌లతోపాటు గురుకులాలు, మాడల్, కేజీబీవీలు 15 నుంచి ఒంటి పూట బడులు నడిపించనున్నట్లు ఎంఈవోలు తెలిపారు. పదో తరగతి పరీక్షలు కూడా ఈ నెల మార్చిలోనే ప్రారంభమవుతున్నాయన్నారు. 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ ఒంటి పూట బడులు నడుస్తాయన్నారు. పరీక్షలు లేని పాఠశాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాలలు నడుస్తాయన్నారు. పరీక్షలు రాసే పదో తరగతి విద్యార్థులు మినహా 1 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు ఒంటి పూట బడులకు హాజరు కావాలన్నారు. విద్యార్థులకు వేడి తగల కుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలను చేపడుతుందన్నారు. గదుల్లో కాకుండా ఆరుబయట చెట్ల నీడన ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెబుతారని ఎంఈవోలు తెలిపారు.

## ఘనంగా బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ పుట్టిన రోజు



మెదక్ మున్సిపాలిటీ, మార్చి 8: బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ పుట్టిన రోజు వేడుకలు మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలమాలలతో సన్మానించి కేక్ కట్ చేసి తినిపించారు. వేడుకల్లో బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ గడ్డమీది కృష్ణాగౌడ్, మాజీ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, కిశోర్, శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ అంజనేయులు, బీఆర్‌ఎస్ శ్రేణులు శ్రీనివాస్‌గౌడ్ కిరణ్, అరుణ్, రంజిత్ నాయక్, వినయ్, తరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీ పడి కేసులు పరిష్కరించుకోవాలి




లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న సివిల్ జడ్జి

నర్సాపూర్, మార్చి 8: జాతీయ లోక్ అదాలత్ ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకుని కేసులు తొలిగించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి రుబీనా ఫాతిమా సూచించారు. శనివారం నర్సాపూర్‌లోని కోర్టు ఆవరణలో జడ్జి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్షణికావేశంలో తగాదాలు పడి కేసులు నమోదై, కోర్టు చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా శాంతియుతంగా మాట్లాడుకుని రాజీపడాలన్నారు. అనంతరం పలు పోలీస్, బ్యాంకు కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో పీపీ రాఘవేంద్ర, ఏజీపీ సుధాకర్, ఎస్సై లింగం, న్యాయవాదులు పాల్గొన్నారు.

## గంగమ్మ గుడిలో అలంకరణ లైట్ల చోరీ

తూప్రాన్, మార్చి 8: తూప్రాన్ పెద్ద చెరువు కట్టపై ప్రధాన రహదారికి అనుకుని ఉన్న గంగమ్మ గుడిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుడికి అలంకరించిన లైట్లను దుండగులు ఎత్తుకెళ్లారు. శనివారం చోరీ విషయం తెలుసుకున్న గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప దేవేందర్, సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే గుడిలో హుండీతో పాటు వెండి వస్తువులను కూడా గతంలో ఎత్తుకెళ్లారు. అప్పుడు చోరీకి పాల్పడిన వ్యక్తులే ఇప్పుడు కూడా పాల్పడి ఉంటారని అనుమానాన్ని వ్యక్తం చేశారు.